
# సినీగీత - అమెరికన్ స్టైల్

- డాక్టర్ కె.వి.ఎస్. రామారావు



**వేలంపాట వీరావేశంగా సాగుతోంది.**

***జనంతో నిండిన హాలు చిరంజీవి సినిమా మొదటి రోజులాగా వేడిగా, హైదరాబాద్ ఎయిర్ కండి షన్డ్ థియేటర్ల లాగా ఉక్కగా, టికెట్ దొరకని తెలుగు వెలుగు బుర్రలా గజిబిజిగా ఉంది.***

ఈ సందర్భం కోసం ప్రత్యేకంగా పెట్టించిన పది ఫోన్లు తెలుగు సినిమా హాస్యగాళ్ళలాగా ఆగకుండా గందరగోళంగా రణగొణ ధ్వనులు చేస్తున్నాయి. ఇంటర్నెట్ మీద ఎడతెగకుండా వస్తున్న పందేల్ని తీసుకునే పనిలో మరో ఐదుగురు అర్భకులు తల మునకలై పోతున్నారు.

''తెలుగు సినీ కళాకారులకు ఆతిథ్యాన్నిచ్చే అదృష్టాన్ని ఇప్పుడే కొనుక్కోండి.''

''ఆలస్యం చేసి అందరి ముందూ అల్లరి పాలు కావొద్దు.''

''ఇదే సదవకాశం.''

ఇలా రకరకాల బేనర్లు గది చుట్టూ కనబడు తున్నాయి.


సుబ్బారావుకి టెన్షన్‌తో హార్ట్ ఎటాక్ వచ్చేలాగా అనిపిస్తోంది.

''పది వేలు - పదివేల డాలర్లు. పదకొండు అనే వాళ్ళు ఎవరన్నా ఉన్నారా?'' అంటూ ఒకసారి చుట్టూ చూసింది వేలం పాడుతున్న వ్యక్తి. అలాటి వాళ్ళు ఎవరూ కనిపించలేదు. అంతా తెలుగు సిని మాలో సీరియస్ సన్నివేశం చూస్తున్న ప్రేక్షకుల్లాగా చిరునవ్వులు చిందిస్తూ చిద్విలాసంగా కూర్చుని ఉన్నారు. ''అయితే నంబర్ 230 గారికి శంకరా భరణం సోమయాజులు గారిని పది వేలకు ఇచ్చే స్తున్నాం. ఒకటో సారి, రెండో సారి, మూడో సారి'' అని అంతలోనే ఆ ఆసామీ నంబర్ 230 ముఖంలో తాండవిస్తున్న పేదరికాన్ని చూసి ఎందుకైనా మంచి దని, ''నంబర్ 230 గారు చాలా అదృష్టవంతుల్లాగా ఉన్నారు. సోమయాజులు గారిని రెండు రోజుల పాటు వాళ్ళింట్లో ఉంచుకుని పూజించుకునే ఛాన్స్‌ని భలే చవగ్గా కొట్టేశారు. ఇంటి నుంచి బయ ల్దేరేటప్పుడు ఎన్‌టిఆర్ గారి పటానికి బాగా పూజ చేసుకుని వచ్చినట్లున్నారు. కంగ్రాచ్యులేషన్స్!'' అని ఓ వెర్రి నవ్వు నవ్వి సుత్తితో బల్లమీద కొట్టింది. అప్పుడు వినిపించిన ఏడుపుతో కూడిన మూలుగు ఆ సుత్తి కింద చూడకుండా చెయ్యి పెట్టిన ఆసా మిదో లేక పదివేలకు చెక్కు రాయబోతున్న ఆ గ్యాస్ స్టేషన్ చిరుద్యోగి నంబర్ 230 గారిదో ఆ గందరగో ళంలో ఎవరికీ తెలిసే అవకాశం లేకపోయింది.

ఇంటి నుంచి వచ్చేటప్పుడు భార్య తనకిచ్చిన పేర్ల లిస్టు అప్పటికి ఏ వెయ్యోసారో చూసుకున్న సుబ్బారావు మనసు భోరుమని వంద వయొలిన్ల నేపథ్య సంగీతంతో బావురుమన్నది. ఉన్నంతసేపూ మందు కొట్టి మంచమెక్కే మహాత్ములకే పది వేలంటే ఇక తన లిస్టులో ఉన్న వాళ్ళ దగ్గరకు వచ్చే పరికి తేలిగ్గా అరమిలియను దాటేట్టుంది!

సుబ్బారావు మళ్ళీ ఒకసారి చుట్టూ చూశాడు. తన ముందు వరసలో, ధీమాగా కాలుమీద కాలు వేసుకుని కుర్చీలో వెనక్కు విలాసంగా వాలి చిరు నవ్వులు చిందిస్తున్నారు మల్టీ మిలియనీర్లు. వాళ్ళ లో కొందరు చూసేవాళ్ళకి ఒక వేళ తమ పరిస్థితి అర్థం కాదేమో అని దయతో మెడలో స్టెతస్కోపు లతో సహా వచ్చి కూర్చున్నారు, ఇంకొందరు వీళ్ళ కన్నా దయార్ద్ర హృదయులు. ఆపరేషన్ థియేటర్ నుంచి నేరుగా వస్తున్నాం అని చూపించటానికి పేషంట్ల రక్తంతో శోభిల్లుతున్న సర్జికల్ గౌన్లు, గ్లవ్స్‌ తో మోహనాకారులై ఆసీనులయ్యారు. వాళ్ళతో ఈ విషయంలో పోటీ పడలేని ఇండస్ట్రియలిస్టులు అంత వేడిలోనూ తమ టాక్సీ డోరు తియ్యకుండా నల్ల కళ్ళద్దాలలోంచి చిద్విలాసంగా చుట్టూ చూస్తు న్నారు. అంతలో అప్పటి వరకు ముందు వరసల్లో కూర్చున్నా కూడా ఒక్క పందెం కూడా కాయని సిగ్గులేని వాళ్ళని వేలంపాట వారు అర్జంటుగా వెనక వరస సీట్లలోకి నెట్టెయ్యటం, ప్రమోషన్ వచ్చిన వీరపుంగవులు కొందరు ముందుకు దూకి వెళ్ళి క్షణంలో ఆ సీట్లని ఆక్రమించటం జరిగిపో యాయి.

''ఇప్పుడొక సర్‌ప్రైజ్ ఐటం వేలం వెయ్యబో



తున్నాం. ఇక్కడ ఇంత హడావుడిగా ఉన్నా కూడా బయటే వుండిపోయిన మందుపుంగవులు అర్జంటుగా లోపలికి రావాలి'' అనే అనౌన్స్‌మెంట్ వినబడటంతో ఒక్కసారిగా హాలంతా ఉత్తేజితమైపోయింది. చేతిలో సీసాలతోనూ, గ్లాసులతోనూ పరిగెత్తుకొస్తూ జారిపడ్డ ఇద్దరు దేవదాసుల్ని ఓ యాభై మంది తొక్కేసినా వాళ్ళు చెక్కుచెదరని చిరునవ్వుల్తో లేచి చేసిన బెల్లీ డాన్స్ కూడా ఆ గందరగోళంలో ఎవర్నీ ఆకర్షించలేకపోయింది. ''మీకిచ్చిన లిస్ట్‌లో లేని ఒక ప్రముఖ వ్యక్తిని ఇప్పుడు వేలం వెయ్యబోతున్నాం. కాచుకోండి, ఆ వ్యక్తి పేరు వితో మొదలవుతుంది'' అని అరిచింది మైక్.

''వినీత, విలాసిని, విజయశాంతి ...'' ఇలా ఊహాగానాలు మెటల్ రాక్ స్థాయిలో ఊపందుకున్నాయి. అంతలో ఒక మేధావి, ''వి అంటే మరి తెలుగు వీనా ఇంగ్లీషు వీనా?'' అని అరవటంతో అందరూ ఒక్కసారిగా ''హన్నా'' అని టపటప ముక్కుల మీద వేళ్ళేసుకున్నారు. ముక్కులు బద్దలయిన ఒకరిద్దరు కాటన్ కోసం బయటికి పరిగెత్తారు. ఆ శబ్దం సద్దుమణిగాక, ''హహ్హహ్హ'' అన్న వికటాట్టహాసంతో పాటు ''భలే బోల్తా పడ్డారు కదా! అది ఇంగ్లీషు వి'' అన్నది మైక్. ''అయితే ఆడా మగా?'' అని మళ్ళీ అడిగి తన ఐక్యూని మరోసారి నిరూపించుకున్నాడా మేధావి. అప్పటిదాకా ''మేధావులం'' అని మెడల్లో బోర్డులు వేలాడదీసుకుని కూర్చున్న వాళ్ళు అర్జంటుగా వాటిని తీసి సీట్ల కింద దాచేసుకున్నారు. జనం మళ్ళీ ముక్కుల మీద వేళ్ళేసుకునే అవకాశం ఇవ్వకుండా ''మగ'' అని అరిచింది మైక్. హాలంతా ఒక్కసారిగా నిశ్శబ్దం అయిపోయింది. ఓ కొంటె కుర్రాడు గుండు సూది కింద పడెయ్యటంతో చెవులు బద్దలైన కొంత మంది తుడుచుకోవటానికి బయటికి పరిగెత్తారు. వేలం వెయ్యబోతున్న పేరు దాదాపు అందరికీ అర్థమైపోయినా పైకి అనలేని ఉద్వేగంతో అంత అచేతనావస్థలోకి వెళ్ళిపోయారు. ఒక నిమిషం పాటు ఆగిన మైక్ ఇంక భరించలేక ''విక్టరీ వెంకటేష్'' అని చెవులు తూట్లుపడేట్లు ఒక్క అరుపు అరిచింది.

జనం అంతా జయజయ ధ్వానాలు చేశారు. ఆడవాళ్ళు బ్రేక్ డేన్స్‌లు చేశారు. హై ఫైవ్‌లు ఇచ్చుకున్నారు.

''మూడు రోజులు'' అని అరిచింది మైక్ మళ్ళీ. జనం ఆనందంతో పిచ్చెక్కిపోయి శివతాండవాలు చేసేశారు.

లక్ష డాలర్ల దగ్గర మొదలయ్యింది పాట. వర్షాకాలంలో కొండవాగు లాగా మూడు లక్షల వరకు ఉరుకులు పరుగుల్తో సాగింది. అక్కడి నుంచి మైదానంలో నదిపాయ లాగా డేక్కుంటూ పాక్కుంటూ మెల్లగా నాలుగు లక్షలకు చేరింది. అంతలో ఒక్కసారిగా జలపాతంలాగా జోరు తెచ్చుకుని హడావుడిగా అరమిలియనుకు చేరుకుంది. అప్పుడిక ఎత్తు నుంచి జారిపడి కుంటుకుంటూ మెల్లగా సాగి చివరకు ఆరు నిమిషాల తరువాత ఆరు లక్షల దగ్గర ఇంక కదల్లేక కూలబడింది. పందెంలో గెలిచిన పద్మావతి గారికి హై ఫైవ్‌లు ఇస్తూ కంగ్రాచ్యులేషన్స్ చెప్పే వాళ్ళ హోరు సద్దుమణగటానికి ఇంకో పావుగంట పట్టింది. ''నా మూడు రోజుల్లో ఒక రోజుని మూడు లక్షలకి ఎవరికైనా ఇస్తాను కావాలంటే'' అని కేక పెట్టి ఆవిడ బయటికి దారి తియ్యటంతో ఆవిడ వెనకే హాల్లో సగం మంది పరిగెత్తారు. ఆ తొక్కిడిలో లోపల బీర్లు సర్వ్ చెయ్యటానికి వస్తున్న ఇద్దరు వెయిటర్లు పేలికలైన గుడ్డల్తో వెంట్రుక వాసిలో చావులు తప్పించుకుని బయటపడ్డారు.

సుబ్బారావు కళ్ళు మూసుకున్నాడు. ఎదురుగా వాళ్ళావిడా, ఇద్దరు పిల్లలు ప్రత్యక్షమయ్యారు. అందరి చేతుల్లోను బేస్‌బాల్ బేట్లు. ''రంభని సంపాయించకుండా తగుదునమ్మా అని చేతులూపుకుంటూ ఇంటికి వచ్చావా? రా, ఇక నీ గతి కుక్కలు కూడా పడవ్'' అని హెచ్చరిస్తూ ఇంగ్లీష్ హారర్ సినిమాలో జాంబీల్లాగా ముగ్గురూ మార్చ్ చేస్తూ ముందుకు వస్తున్నారు. ఆ దృశ్యానికి ఉలిక్కిపడి లేచి సర్దుకుని కూర్చున్నాడు సుబ్బారావు. జేబులోంచి నోట్‌బుక్ తీసి నూట పదహారో సారి మళ్ళీ తన దగ్గర ఉన్న డబ్బు లెక్క చూసుకున్నాడు. ఇంటి మీద తీసుకున్న హోమ్ ఎక్విటీ లోన్, లైఫ్ ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ సేవింగ్స్ నుంచి తీసుకున్న లోన్లు కలిపి ఓ అరమిలియన్ చేతికి వచ్చినయ్. ఇక పోతే, రెండేళ్ళ క్రితం స్టాక్స్‌లో పెట్టిన పదివేలు ఇప్పటికి లక్షయ్యాయి. ఇరవై ఏళ్ళ నాడు మ్యూచువల్ ఫండ్‌లో వేసిన డెబ్బై వేలు కూడా ఇప్పటికి మరో లక్షయింది. మొత్తం కలిసి ఏడు లక్షలు తేలింది. అరమిలియన్‌తో రంభని సంపాయించి కొంచెం డబ్బు పిల్లల కాలేజీ చదువులకు మిగుల్చుకుందాం అనుకున్నాడు గాని ఇక్కడి పరిస్థితి చూస్తుంటే తన దగ్గరున్న ఏడు లక్షలూ రెక్కలు కట్టుకుని ఎగిరిపోయేట్టే కనిపిస్తోంది. రంభ లేకుండా తిరిగి వెళ్తే రేపట్నుంచి తను తలెత్తుకు తిరగలేడు. పోనీ ఊరు విడిచి ఇంకో చోటికి వెళ్దామన్నా ఈ ఇన్ఫర్మేషన్ ఏజ్‌లో ఎక్కడని దాక్కోగలడు?

ఇంతలో హఠాత్తుగా సెల్‌ఫోన్లన్నీ ఒక్కసారి కూడబలుక్కున్నట్టు మోగటం మొదలెట్టాయి. చూస్తుండగానే ఓ పది మంది హడావుడిగా బయటికి పెరిగెత్తారు. ''ఇంటర్నెట్ స్టాకులు క్రాష్ ఔతున్నాయిట'' అని ఎవరో అన్నారు గాని, హాల్లో వాళ్ళ చెవుల్ని బద్దలు చేస్తున్న ''ఏమైంది, ఏమైంది'' అన్న గుసగుసల్లో ఆ మాట ఎవరికీ వినపడ్డట్టు లేదు. ''అవతల హిందీ యాక్టర్ల వేలం జరుగుతుందేమో!'' అని ఒక పూర్తి బట్టతల చమత్కారి తన పక్కనున్న కుర్రమ్మాయితో వేసిన చచ్చు జోక్ అరక్షణంలో, ''అవతల గదిలో హిందీ యాక్టర్ల వేలం జరుగుతుందిట!''గా రూపాంతరం చెందేసరికి హాలు హాలంతా ఒక్క సెకండ్‌లో ఖాళీ అయిపోయింది.


వేలం పాట నిర్వాహకులు అర్జంటుగా సెల్‌ఫోన్ల మీద వాళ్ళ లాయర్లతో సంప్రతింపులు మొదలెట్టారు. హిందీ యాక్టర్ల కోసం వెదికే జనాన్ని అదుపులో పెట్టటానికి హాలు వాళ్ళు 911కి గబగబా ఫోన్లు చేశారు. ఏటా స్పెయిన్‌లో జరిగే ఎద్దుల పరుగు ఇక్కడికెలా వచ్చిందా అని రోడ్డు మీద వెళ్తున్న ఒక కుతూహలుడు కారు స్లో చెయ్యటంతో

పక్కనున్న గరల్‌ఫ్రెండ్‌కి ఈ తమాషా చూపిస్తున్న వెనక్కారు వాడు స్పీడ్ తగ్గించటం మరిచిపోయి ఇంజన్ పచ్చడయ్యేట్టు ముందు కారుని కొట్టాడు. అంతలో ఓ ట్రక్కు వచ్చి ఆ రెంటినీ కలిపి తుక్కు కింద చితగ్గొట్టి తన ప్రతాపాన్ని చాటుకుంది. చూస్తుండగానే రోడ్డంతా రణరంగంగా మారి పోయింది.

గంటకి వెయ్యి డాలర్లు తీసుకునే ఓ బ్రిలి యంట్ల లాయర్ సలహా మీద వెంటనే ''హిందీ యాక్టర్ల వేలం పాట ఎక్కడో కాదు, ఇక్కడే ఇంకా సేపట్లో మొదలు కాబోతోంది; ముందు తెలుగు తర్వాత హిందీ'' అనే అనౌన్స్‌మెంట్ వినపడింది. అందరూ మళ్ళీ పరిగెత్తుకుంటూ తిరిగి వచ్చారు. ''మాకు తెలుగు వాళ్ళు వద్దు హిందీ వాళ్ళే కావాలి'' అనే నినాదం ఎలా మొదలయ్యిందో గాని అంతలోనే ఉధృతంగా ఉప్పెనగా మారిపోయింది. తెలుగు యాక్టర్లని వేలంలో పాడుకున్న వాళ్ళు ''మా డబ్బు మాకు తిరిగియ్యాలి'' అంటూ మరో నినాదం ప్రారంభించారు. తనకు వచ్చిన మూడు రోజుల్నీ ముగ్గురికి అమ్మేసి అప్పటికి అప్పుడే మూడు లక్షల లాభం సంపాయించిన పద్మావతి గారిని ఆవిడ కస్టమర్లు ఘెరావ్ చెయ్యటం మొదలుపెట్టారు.

వేలం నిర్వాహకులు మళ్ళీ అర్జంటుగా వాళ్ళ వెయ్యి డాలర్ల లాయర్‌కి ఫోన్ చేశారు. హాల్లో మోతకి ఏ క్షణంలోనైనా కప్పు తుపుక్కున కుప్పకూలిపోయే సూచనలు కనపడుతుండగా, ''ఒక ముఖ్య ప్రకటన. ఈ హాల్లో ఒక పెద్ద బాంబు ఉందని ఇప్పుడే మాకు సమాచారం అందింది. ప్రాణాల మీద ఆశ ఉన్న వాళ్ళందరూ వెంటనే ఖాళీ చెయ్యండి'' అని రైల్వే స్టేషన్ అనౌన్సర్ గొంతుతో మైక్ అరిచింది. అది విన్నా జనంలో ఎవరూ కదలకపోగా అందరూ ఒక్క సారిగా అమ్రీష్‌పురిని గుర్తు చేసుకుని అట్టహాసాలు చేశారు. ''ఇలాంటి ఉత్తుత్తి బాంబ్ స్కేర్‌లు ఇదిగో నా తల వెంట్రుకలన్ని చూశా. హిందీ యాక్టర్ల వేలం అయ్యే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదు'' అనరిచాడు నెత్తిమీద ఒక్క పీచు కూడా మిగలని ''అనేక యుద్ధములలో ఆరితేరిన వృద్ధమూర్తి'' ఒకాయన. అందరూ ''ఔనూ ఔనూ'' అని కేకలు పెట్టారు.

మైక్‌లోనుంచి కొన్ని గుసగుసలు. ''అంతే'' అన్న ఒక హాహాకారమూ వినపడ్డాక, ఇప్పుడేం జరుగుతుందా అని అందరూ ఆలోచిస్తుండగా ఒక వస్తాదు ఒక పెద్ద పెట్టెని బరువుగా మోసుకుంటూ లోపలికి వచ్చాడు. దానిమీద పెద్ద పెద్ద అంకెలు ఆత్మహత్య చేసుకోవటానికి ఊరు బయటికి దూసుకెళ్ళే తెలుగు సిన్మా హీరోయిన్‌లా లైట్ స్పీడ్‌లో పరుగెడుతున్నాయి. ఆ అంకెల్ని అందరికీ




చూపిస్తూ ఆ వ్యక్తి గంభీరంగా, ''చూస్తున్నారుగా, ఇదే ఇందాక చెప్పిన బాంబు. ఇంక సరిగ్గా మూడు నిమిషాల్లో పేలబోతుంది, ఇక్కడే ఉంటారో బయటికి వెళ్తారో ఇక మీ ఇష్టం'' అని ఉపన్యసిం చాడు. ఈ సీన్‌ని ఇదివరకు ఏ సిన్మాలోనూ చూసి ఉండకపోవటంతో ఏం చెయ్యాలో తోచక జనం కొంచెం సీరియస్‌గా మొహమొహాలు చూసుకో వటం మొదలెట్టారు. కొందరు తెలుగుతనం మూర్తీ భవించిన వాళ్ళు మాత్రం ''వాణ్ణీ వాడి బాంబునీ బైట పారేద్దాం పదండి ముందుకు పదండి తోసుకు'' అంటూ ఎప్పుడో విన్న శ్రీశ్రీ పాటని గుర్తుతెచ్చుకుంటూ గర్జించారు. అయితే వాళ్ళ ఆవిళ్ళు కొంచెం ముందు చూపుతో ఆలోచించి గద్దించి, వాళ్ళని వెంటనే తోకలు ముడిపించేశారు. దాంతో ఇంక బాంబు పేలటానికి ఒక నిమిషం వుందనగా హాలంతా ఖాళీ అయింది.

కాళ్ళీడ్చుకుంటూ సుబ్బారావు బయటికొ చ్చాడు. వట్టి చేతుల్తో ఇంటికి వెళ్ళాలని తలుచు కుంటేనే గుండె రైలింజన్లా శబ్దం చేస్తోంది. నరక కూపంలోకి వెళ్తున్న ఫీలింగ్. కళ్ళ ముందు ప్రపంచం అంతా గిరగిరా తిరగటం మొదలెట్టింది. ఎలాగో వెదుక్కుంటూ తన కారు దగ్గరికి చేరుకుని తాళం తీసే ఓపిక్కూడా లేక కారుకి ఆనుకుని నిలబడ్డాడు సుబ్బారావు.

ఇంతలో అంత చీకట్లోనూ కళ్ళు మిరుమిట్లు గొలిపే వెలుగు అతని కళ్ళ ఎదుట ప్రత్యక్షమైంది. ఆ వెలుగు మధ్యలో తెల్లటి పొడవాటి గడ్డం ఉన్న ఒక వ్యక్తి లీలగా కనిపించాడు. ఆ కాంతిని భరించలేక సుబ్బారావు కళ్ళు మూసుకున్నాడు. అతన్ని హిప్నా టైజ్ చేస్తూ మెల్లగా మంద్ర స్వరంలో మాటలు వినపడసాగాయి. ''సుబ్బారావ్! వెర్రివాడా'' అన్నదా కంఠం. ''ఈ రోజు వేలంలో రంభని గెలుచుకోలేక పోయానని బాధపడకు. ఇంత మంది సినీ నరనారీ దాసానుదాసుల్లో నువ్వెంత? కేవలం ఒక పిపీలక ప్రాణివి. ఈ వేలం మీ అహంకారాలకి గాలం. కాని దానికిప్పుడు చెల్లిపోయింది కాలం. నీకు ముంచు కొచ్చింది బాగుపడే యోగం. లే, సాహసము సేయరా ఢింభకా! నీ దగ్గరున్న డబ్బంతా తీసుకుని హైదరాబాద్‌కి ప్రయాణం కట్టు. సినీరంగంలోకి అడుగుపెట్టు. అయితే అందరు అమెరికా ఆంధ్రు ల్లాగా నువ్వు కూడా సినిమాలు తియ్యకు. తీసే చచ్చుదద్దమ్మలకు భారీ వడ్డీల్తో జోరుగా పెట్టుబడి పెట్టు. కాలు కింద పెట్టకు. సినీజనం తలలమీదే పెట్టు. వచ్చే ఏడు ఈ పాటికి నువ్వో సినీ రాక్షసుడి వవుతావు. అప్పుడు నువ్వే భారీ తారాగణాన్ని వెంట పెట్టుకుని వాళ్ళ నాయకుడిగా ఇక్కడికి తిరిగి రావచ్చు. ఇప్పుడు ఇక్కడ వాలెట్ల బరువు చూసు కుంటూ తన్మయావస్థల్లో వున్న వాళ్ళంతా అప్పుడు నిన్ను చూడటానికి తాకటానికి పోటీలు పెట్టుకుని వెంటపడతారు. ఇది తథ్యం. విజయోస్తు. అడుగు ముందుకెయ్యి. జయమ్ము నిశ్చయమ్మురా భయమ్ము లేదురా!''

సుబ్బారావు కళ్ళు తెరిచేసరికి ఎదురుగా ఎవరూ కనిపించలేదు గాని తెలుగు సిన్మాలోలాగా అవే డైలాగులు మళ్ళీ మళ్ళీ అతని చుట్టూ సరౌండ్ సౌండ్‌లో వినపడసాగాయి. అజ్ఞానం పటాపంచలై పోయి కర్తవ్యోన్ముఖుడైన సుబ్బారావు దృఢ నిశ్చ యంతో బిగుస్తున్న దవడ కండరాలతో నేరుగా ఎయిర్‌పోర్ట్‌కి కారుని మళ్ళించాడు.

(ఈ కథకు ప్రేరణ శ్రీ ముళ్ళపూడి ''విక్రమార్కుడి మార్కు సింహాసనం'', 'సన్మాన భంగం'' రచనలు) ★